

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ



జబ్ సే మిలాహూ తుం సే
ముస్కురాతా రెహితా హూ
జోభీ మిల్తా హై ముఝ్సే
సునాతే ఫిర్తా హూన్.
దూర్ రహనా ఇస్ మాయా జాల్ సే
వర్నా తేరా జీనా దుష్వార్ హోజాయేగా
హస్ మత్ పగ్లీ ప్యార్ హో జాయేగా...

సిద్ధార్థ్ గరిమ 'టాయ్‌లెట్ – ఏక్ ప్రేం కథ' సినిమా కోసం రాసిన ఈ పాటకు సంగీత దర్శకుడు విక్కీప్రసాద్. పాటను మధురంగా పాడారు సోనూ నిగం, శ్రేయా ఘోషాల్. పాట వింటూంటే చాలా హాయిగా అనిపిస్తుంది. పంజాబీ పాటలు, పదాల హోరులో హిందీ సినిమా పాటలు భాంగ్రా నృత్యాలు, పాశ్చాత్య బీటులను చేస్తూ హోరెక్కిస్తున్న సమయంలో ఎంతో మధురంగా ధ్వనిస్తుందీపాట. పాటలో పదాలు కూడా చాలా చక్కగా, మృదువైన శృంగార భావనలను తలపింపచేస్తున్నాయి.

ఆమెని కలసినప్పటినుంచీ అతడు తనలో తాను నవ్వుకుంటూంటాడట. ఎవరిని కలసినా ఏదో సంతోషంగా మాట్లాడుతూంటాడట. ఈ మాయాజాలం నుంచి దూరంగా ఉండాలనుకుంటున్నాడు. ఎందుకంటే, ఇది ఇలాగే కొనసాగితే ఆమెకు దూరంగా ఉండలేడు. ఆమెలేని జీవితం దుర్భరం అయిపోతుంది. బ్రతకటం కష్టం అయిపోతుంది. కాబట్టి ఆమె అతడిని చూసి నవ్వితే ప్రేమ పుట్టుకొచ్చేస్తుంది కాబట్టి నవ్వద్దంటున్నాడు. పాటలో భావాలు కూడా ఎంతో మృదువుగా, సున్నితంగా ఉంటాయి.

తూనే ఖోలా మేరా ఆస్మాన్
ఏక్ చాంద్ రోషన్ హువా
ఖాలీ సా థా మన్ మేరా
తారోం కా ఆంగన్ హువా

ఆమె హృదయపు ఆకాశాన్ని అతడు ఆవిష్కరించాడు. వెన్నెల విరిసింది. అప్పటివరకు శూన్యంగా ఉన్న మనసు తారల ప్రాంగణం అయింది. పాట వింటూంటే కలిగే మాధుర్య భావన తెరపై పాటను చూస్తూంటే కలగదు. ఎందుకంటే ఒక అమ్మాయిని ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వెంట పడటం తెరపై కనిపిస్తుంది. ఆ వెంట పడేది హీరో అవటంతో, అమ్మాయిలకు ఇష్టంలేకున్నా వారివెంట పడటం అంటే stalking కు ఒక రకమైన చట్టబద్ధత వచ్చేస్తుంది. ఎందుకంటే, హీరో ఏం చేసినా మంచే చేస్తాడు. హీరో ఆదర్శం. హీరో మనకు దైవ సమానం. కాబట్టి తెరపై హీరో చేసింది, నిజ జీవితంలో యువతీ యువకులు అనుకరిస్తారు.

ఈ పాటలో అక్షయ్ కుమార్ నాయిక వెంటపడతాడు. ఆమె ఇంటిముందు కూర్చుంటాడు, ఆమె ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తూ. ఆమె ఆటోలో వెళ్తూంటే టూవీలర్ మీద ఆటోను వెంబడిస్తాడు. ఆమె ఎటువెళ్తే అటు వెళ్తాడు. సెల్‌ఫోన్లో ఆమెకు తెలియకుండా ఆమె ఫోటోలు, వీడియోలు తీస్తాడు. ఆమె కాలేజీలో చెట్టెక్కి మరీ ఆమె వీడియోలు తీస్తాడు. ఇదంతా చూస్తూంటే నోరు చేదయిపోతుంది. ఈనాడే కాదు ఎప్పటినుంచో సమాజానికి నడతను నేర్పుతోంది సినిమా. ఆలోచనలు ఇస్తోంది సినిమా.

**యూతో హంనే లాఖే హసీన్ దేఖా హై**

**తుంసా నహి దేఖా**

అంటూ అనుకోకుండా కలసి ప్రయాణం చేసిన నాయకను ఏడిపిస్తూ నాయకుడు పాడతాడు. ఆ పాడింది మహమ్మద్ రఫీ, నటించింది షమ్మీకపూర్ కాబట్టి ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. 'తారీఫ్ కరూన్ క్యా ఉస్‌కీ జిస్నే తుఝే బనాయా' అంటూ హీరో నాయికను అందరి ముందూ ఏడిపిస్తూ వెంటపడ్డా అసహ్యం కలగదు. పెదవులపై చిరునవ్వు నిలుస్తుంది. పైగా పాటలో గేయ రచయిత కవిత్వం చిలికించటం పాటకి విలువను పెంచుతుంది.

**హర్ సుబహ కిరణ్ కీ లాలీ**

**హై రంగ్ తెరే గాలోంకా**

**హర్ షాం కి చాదర్ కాలీ**

**సాయా హై తెరే బాలోంకా**

'ప్రతి ఉదయపు అరుణిమ ఆమె బుగ్గలపై ప్రతిఫలిస్తుంది. సాయంత్రపు నల్లటి దుప్పటి ఆమె కురుల నీడ. ప్రేయసిని ఇంత భావుకతతో వర్ణించటం, తెరపై నాయకుడు నాయికనుఏడిపిస్తున్నాడనన్న కన్నా ఆరాధిస్తున్నాడన్న భ్రమను కలిగిస్తుంది.

**క్యా అజీబ్ రంగ్ మే సజ్ రహీ హై ఖుదాయీ**

**కే హర్ చీజ్ మాలిక్ నె సుందర్ బనాయీ**

**నదియా క చమక్ తా హై దర్పన్,**

**ముఖ్డా దేఖ్  సప్నోంక దుల్ హన్**

**తుఝే  దేఖే కె కెహెతా హై మేర మన్**

**కహి ఆజ్ కిసీసె మొహబత్ నహోజాయే.**

'ప్రొఫెసర్' సినిమాలో నాయికను ఏడిపిస్తూ అందరిముందూ వెంట పడుతూ పాడతాడు నాయకుడు పాట. కానీ పాటలో భావం అతడు వెంటబడటం ఓ పవిత్ర చర్య అన్న భ్రమ కలిగిస్తుంది. బాణీలో మాధుర్యం, రఫీ స్వరం పాటను వినటం, అనుభవించటం ఒక ఆధ్యాత్మిక అనుభవం స్థాయికి ఎదిగింపచేస్తాయి. మనసు మరో లోకంలో విహరిస్తుంది. ప్రకృతి ఎంతో అందంగా కనిపిస్తోందట. భగవంతుడు ప్రతికణాన్ని సుందరంగా మలచాడట. ఈ భావన ఆమెని చూస్తే అతడిలో కలిగింది. ఎందుకంటే మెరిసే దర్పణంలాంటి నది నీటిలో అతని స్వప్నాల రాణి ముఖం చూసుకుంటోంది. అద్భుతం అనిపిస్తుంది. అక్కడ హీరో నాయిక ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెని వెంబడిస్తున్నాడన్న భావన కలగదు. గాలివీయటం, నీరు పారటం ఎంత ప్రాకృతిమో, నాయికను చూసి నాయకుడు వెంటాడి పాడటం అంత ప్రాకృతికం అనిపిస్తుంది. ఇంకాస్త పాడితే పాడితే బాగుంటుందనిపిస్తుంది. అంతగా మధురమైన పాటకు స్ఫూర్తినిచ్చిన నాయికపై గౌరవం కలుగుతుంది.

దేవ్ ఆనంద్ మానా జనాబ్ నే పుకారా నహీ, క్యా మేర సాథ్ భి గవారా నహీ ' అంటూ 'నా సాంగత్యం ఇష్టంలేదా? ' అని నాయిక వెంట పడటంలో అస్వాభికం, రాక్షసత్వం ద్యోతకమవదు, మనసులో గిలిగింతలు కలుగుతాయి. 'రాజ్‌కపూర్' హం నె తుఝ్ కో ప్యార్ కియా హై జితానా, కౌన్ కరేగా ఇత్ నా? ' అని నాయికను నిలదీసినా అవునూ ఇంత తీవ్రంగా ఇంకెవరు ప్రేమిస్తారు అనిపిస్తుంది. 'ప్యార్ ఆంఖోసే జతాయా తౌబురా మాన్‌గయె ', ఆమె వైపు ప్రేమదృక్కులు ప్రసరిస్తేనే కోపం వచ్చేసింది అంటూ రాజేంద్ర కుమార్ సైరాబానును ఏడిపించినా ఇబ్బంది అనిపించదు. ఇంకాస్త ఏడిపిస్తూ పాడితే బాగుంటుందనిపిస్తుంది. చెహెరే పె గిరీ జుల్ఫే కహెదూ తొ హటాదూమైన్, గుస్తాఖీ మాఫ్ అని రాజేంద్రకుమార్ పాడుతూంటే గుస్తాఖీ ఏమిటి, సాత్ ఖూన్ మాఫ్ అనిపిస్తుంది.. కానీ నెమ్మది నెమ్మదిగా, ఎలానో, ఈ నాయికా నాయకుల వెంటబడతాలు, ఏడిపించటంలో రాక్షసత్వం చోటు చేసుకుంది. వెంటపడటం అనేది ఒక శృంగార చర్యగా, ఒక మృదుమధురమైన భావనగా కాక 'జబర్దస్తీ'గా మారింది.

'తెరిప్యారీ ప్యారీ సూరత్ కో కిస్ కి నజర్ నా లగే' నీ అందమైఅన వదనానికి ఎవరి దృష్టి తగలవద్దు' అని పాడే హీరో కాస్తా 'తూ చీజ్ బడీ హై మస్త్ మస్త్' అంటూ నాయికను ఒక వస్తువును చేయటం సామాన్యమైపోయింది. దీనికితోడు సినిమాలో నాయికలు కూడా తమని తాము వస్తువులుగా ఆనందాలందించే గనులుగా మాంసపు ముద్దలుగానే ప్రకటించుకోవటం చూస్తూంటే, సినిమాలను గుడ్డిగా అనుసరించే అమాయక మనస్సుల(మనదేశంలో ఈ సంఖ్య అధికం) పై దీని ప్రభావం ఎలా ఉంటుందో ఊహించటం కష్టంకాదు.

తెరపై నాయిక ఎంత గౌరవ ప్రదంగా ఉంటుందో, నాయకుడు నాయికతో ఎంత గౌరవంగా, ఎంత పవిత్రంగా వ్యవహరిస్తాడో సమాజంలో మహిళ అంత గౌరవం పొందుతుంది. ఆమెతో అంత గౌరవంగా వ్యవహరిస్తారు.

'హల్కా జవానీ' పాటలో కరీనా కపూర్ తన యవ్వనం గురించి పాడుతూ 'ఐటం బనాకే చఖ్లే, చఖ్ను బనా కె చభేలే. ఆఖోంకో క్యా సోకె, హాథోసే కర్ మన్ మానీ' అంటుంది. ఆమెని ఓ ఐటం, వస్తువు చేసి పెట్టుకోవాలట. చక్కని తిండి పదార్థంగా తినాలట. కళ్లతో చూస్తూ ఏం చేస్తావు. చేతులతో నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో' అంటోంది. దీని ప్రభావం ఎలా ఉంటుందో ఊహించనవసరం లేదు. 'దబాంగ్ – 2'లో ఫెవికాల్ సే అనే పాటలో 'మైతో తందూరి ముర్గిహు. యార్ ఘట్కో కె సయ్యా ఆల్కహాల్ సే ' అంటుంది నాయిక. ఆమె చికెన్ ముక్కలు చేసుకుని ఆల్కహాల్‌తో తీసుకోమంటోంది. ఆల్కహాల్తో మామూలు ముక్కలు చేసుకుని మింగటం కాదు కాల్చిచంపుతారు. ఇలాంటి భావనల ప్రభావానికి లోనై తమలోని మానవత్వం నశించి పైశాచికత్వం ప్రకోపించినవారు.

'దబాంగ్' సినిమాలో మున్నా బద్నాం పాటలో నాయికను ఝుండూబాం నుంచి సినిమా హాల్ వరకూ పోలుస్తారు. 'లవ్ కా ద ఎండ్' సినిమాలో మట్టన్ పాట ప్రేమకు చరమగీతం పాడేపాట. 'మేరా జిస్మ్ జిస్మ్, మేరా బదన్ బదన్, అరే మై హూ తా జా మటన్, తూ ఖోల్ దిలోంక్ బటన్ బటన్ ' నేను శరీరం, శరీరం నా తాజా మాంసం, నువ్వు హృదయపు బటన్లు తెరవు' రాను రాను ఇలాంటి పాటలు వింటూంటే పాటలో పదాల అర్థాలు చూస్తూ తెరపై జరిగే అత్యంత అసభ్య, అసహజ, లైంగిక చర్యను తలపించే కదలికలను చూస్తూంటే, చీకటిలో హాయిగా కళ్లు, మెదళ్లు అప్పగించి భ్రమలోకం ప్రభావంలో పడి నిజానికి భ్రమకూ తేడాను మరచి అమాయకులపై వీటి ప్రభావాన్ని ఊహించాలంటే భయం వేస్తుంది.

ఇలా సినిమాలో స్త్రీ పాత్రలు తమని తాము తిండి పదార్థాలతోటీ, జుర్రుకునే మలాయీలు, మట్టన్లతోటీ పోల్చుకుంటూంటే నాయకులు తాము చిటికె వేస్తే చాలు తమను నాయిక ప్రేమించాలన్నట్టు జబర్దస్తని ప్రదర్శిస్తున్నారు.

**ఖాలీ పీలీ ఖాలీ పీలీ రోక్నేకానహీ**

**తేరా పీఛా కరూతో టోక్నే కానహీ**

**హో తుఝీ పే రైట్ మేరా**

**తూ హై డిలైట్ మేరా**

**తేరా రాస్తా జో రోకూ**

**చౌంక్నా నహీ**

'తూ మేరీ అగల్ బగల్ హై' అనే హిట్ పాటలోని పంక్తులివి. ఉట్టి పుణ్యానికి హీరోకి అడ్డుపెట్టవద్దట, వెంటపడితే కాదన్నదట.. అంటే వాడేం చేసినా ఆమె అడ్డుపెట్టద్దు, కాదనద్దు. ఎందుకంటే వాడికి ఆమెపై హక్కు ఉందట. ఇక్కడ అమ్మాయి ఇష్టాయిష్టాలతో పనిలేదు. ఆమె మనస్సు ప్రసక్తిలేదు. హీరో వెంటపడ్డాడు. అదే మహాభాగ్యం అని వాడెలా చెపితే  అలా చేయాలి. అలా చేయకపోతే ఏం చేస్తాడో కూడా ఇంకో పాటలో చెప్తాడు హీరో.

**బీడీపీకె నుక్కడ్ పై తెరా లైట్ కియారే**

**ఖాలీ పీలీ అట్ఠారా కప్ చాయ్ పియారే**

**రాజా బేటా బన్ కి జబ్ మై షరాఫత్ దిఖాయీ**

**తూనే బోలీ హట్ మవాలీ భావ్ నహీ దియారే**

**ఎబిసిడి పఢలీ బహుత్**

**ఠండీ ఆహె భర్లీ అచ్ఛీ బాత్ కర్‌లీ బహుత్**

**అబ్ కరూంగా తేరే సాథ్**

గందీబాత్, గందీ బాత్, గందీబాత్, గందీబాత్, గందీబాత్, గందీబాత్... 'ఆర్. రాజ్‌కుమార్' పాట ఇది. బీడీ తాగుతూ ఆమెకోసం ఎదురు చూశాడట. ఎదురు చూస్తూ 18 కప్పుల చాయ్ తాగాడట. ఆమెతో మర్యాదగా వ్యవహరించాడట. ఆమె వాడిని పొమ్మందట. చదువు ఎక్కువయిపోయిందట. దూరంనుంచి నిట్టూర్పులు చాలా విడిచా. ఇంతవరకూ మర్యాదగా మంచిగా మాట్లాడట. ఇకపై ఆమెతో 'గందీ బాత్' మాట్లాడతాడట. 'గందీబాత్ ' అని ఎగుర్తాడు. అంటే మర్యాదగా వినకపోతే బలవంతం చేస్తాడన్నమాట. మర్యాద వలువలు విడిచి పశువై నృత్యం చేస్తాడన్నమాట. ఇది మన ఆదర్శం అయిన హీరోలు నేర్పేది. దీనికన్నా ఘోరం ఏమిటంటే హీరో ఇంత అమర్యాదకరంగా, అవమానకరంగా, నాయిక ఒక మనిషి, ఆమెకూ ఇష్టాయిష్టాలుంటాయి. ఓ మనస్సుంటుంది అన్న ఆలోచనా రహితంగా ప్రవర్తిస్తూంటే నేను మటన్, నన్ను ఆల్కహాల్‌తో నమిలి మ్రింగు అని నాయిక పాడుతూ నాయకుడిని ప్రేమిస్తూంటే దీని ప్రభావం ఇలాంటివి చూస్తూ ఎదిగే బాలబాలికలపై ఎలా ఉంటుందో చెప్పనవసరంలేదు.

మహిళను ఒక వస్తువులా, శరీరంలా మాత్రమే చూపించి, లైంగిక వికృతులకు 'బోల్డ్', గీతలో ఒదిగి ఉండకపోవటం అంటూ అభ్యుదయం, ప్రగతి ముసుగులు వేసుకుని సమర్ధించే వారంతా ఆలోచించాల్సిన విషయం ఇది. మనల్ని మనం సమాజంలో ఎలా ప్రొజెక్ట్ చేసుకుంటున్నామో ఆలోచించాల్సిన తరుణం ఇది. తమ బలహీనతలకు సిద్ధాంతం ముసుగు వేసి, తమ వికృతులకు ఆదర్శం రంగుపూసి, విచ్చలవిడి తనానికి విప్లవం దుస్తులు వేసి, విలువలు వలువలు వలవటమే అభివృద్ధి  అని ప్రచారం చేసే వారంతా ప్రకృతి మనుషుల

మనస్సులలో గీసిన గీతలను గుర్తించి గీతలలో ఒదిగి ఉండటంలోని సభ్యత, భద్రత, సంస్కారాలను గుర్తించాలి. పదిమందికి ప్రకటించాలి. 'కిత్నా సుభ్ హై బంధన్‌మే ' అన్న భావనలోని సంస్కారాన్ని సౌందర్యాన్ని అర్థం చేసుకోవాలి. తమని తాము చులకన చేసుకుని సాటి మహిళలను చులకన చేయవద్దు.

**పంచి బనూ ఉడ్ తె ఫిరూ మస్త్ గగన్ మే**

**ఆజ్ మై అజాద్ హు దునియాకె చమన్ మే**

పక్షిలా మారి గగనంలో ఎగిసే స్వేచ్ఛా విహంగానికి కూడా పరిమితులుంటాయి. ఎంత ప్రయత్నించినా ఆ పరిధులను, పరిమితులను పక్షి అధిగమించలేదు. అలాగే మనిషి కూడా. మనిషిలోని పశువును అణచి, మానవత్వాన్ని జాగృతం చేసేందుకు సమస్త సమాజం ప్రయత్నించాలి. పశువును రెచ్చగొట్టటమే ఆధునిక, అభ్యుదయం గీతలు చెరిపివేయడం అనుకుంటే మానవారణ్యంలో పశువులనడుమ మనుషులను వెతుక్కోవాల్సిన పరిస్థితి వస్తుంది. అందుకే పెద్దలు ఎప్పుడో చెప్తారు మనిషి మనిషిలా అవటం కష్టం అని.

**ఇన్సాన్ బనో  కర్‌లో భలాయిూ క్ క కోయి కాం**

**దునియాసె చలే జూవొగి రహజాయెగ బస్ నాం**

**ఇన్సాన్  బనో....**

మనిషిలా మారి మంచి పనులు చెయ్యి. ఈ ప్రపంచం వదలి వెళ్ళక తప్పదు. ఇక్కడ మిగిలినది మనం చేసిన మంచి పనుల ద్వారా లభించే పేరు మాత్రమే. కాబట్టి కళాకారులంతా సంస్కారవంతులై, తమ ఈనాటి చర్యల ప్రభావం  భవిష్యత్తుపై ఉంటుందని గ్రహించి బాధ్యతాయుతంగా కళను సృజించాలి. భావితరాలకు సరైన సంస్కారం చూసి మార్గదర్శనం చేయాలి.

**హుం లాయే హై తూఫాన్ సే కష్తీ నికాల్ కర్**

**ఇస్ దేశ్ కొ రఖ్నా మెరె బచ్చే సంభాల్కర్**

తుఫాన్ నుంచి నౌకను రక్షించి తీసుకువచ్చాం. ఈ దేశాన్ని మీరే జాగ్రత్తగా చూసుకోవాలి అని భవిష్యతరానికి ఆత్మ విశ్వాసంతో సక్రమ సమాజాన్ని అందించే ప్రయత్నాలు చేయాలి.

**కౌముది పాఠకులకు, మ్యూజికల్ మ్యూజింగ్స్ అభిమానులకూ నూతన సంవత్సర హార్దిక శుభాకాంక్షలు.**

(మరిన్ని పాటలు వచ్చే నెలలో)

Post your comments